క్లుప్తంగా

ఎమ్మెల్యే శంబంగికి మాజీ మంత్రి మద్దతు



ఎమ్మెల్యే శంబంగిని కలిసి మద్దతు తెలుపుతున్న బీసీ నేతలు

బొబ్బిలి: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడును మాజీ మంత్రి పెద్దింటి జగన్మోహన్‌రావు, మాజీ జెడ్పీ చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు తదితరులు ఆదివారం కలిసి, తమ మద్దతు తెలిపారు. ఒకేఒక్క కుటుంబం ఉన్న రాజులకు టీడీపీ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి, నియోజకవర్గంలోని బీసీలకు టీడీపీ అన్యాయం చేసిందని వారు విమర్శించారు. టికెట్ల పంపిణీలో కూడా వైఎస్సార్ సీపీ అన్నివర్గాలకు సమప్రాధాన్యం ఇచ్చిందన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని భరోసా ఇచ్చారు. వారి వెంట మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, బీసీ సంఘ నాయకులు బి.సాయికృష్ణ, కె.సత్యనారాయణ, బి.కాశినాయుడు, ఎం.అప్పారావు, బి.తిరుపతిరావు, టి.దామోదరరావు, వి.శ్రీరాములు, బలరాం, సుధాకరరావు, పి.రామస్వామి నాయుడు తదితరులు ఉన్నారు.

నేడు తెర్లాంలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

తెర్లాం: మండలంలోని తమ్మయ్యవలస, కుమ్మరిపేట, కూనాయవలస, ఎం.ఆర్. అగ్రహారం, రంగప్పవలస, వెలగవలస గ్రామాల్లో వైఎస్సార్ సీపీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారని పార్టీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ప్రచారంలో మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలంతా పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

అక్రమ రవాణాపై నిఘా

రాజాం సిటీ: నియోజకవర్గంలో ఇసుక, మద్యం అక్రమ రవాణాపై నిఘా ఉంచామని ఎస్ఈబీ సీఐ శ్రీధర్ తెలిపారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు మద్యం అక్రమ రవాణాకు సంబంధించి, 70 కేసులు నమోదు చేసి, 78 మందిని అరెస్ట్ చేశామన్నారు. అలాగే సారా తయారీ, సారా రవాణాకు సంబంధించి, నాలుగు కేసులు, ఐదుగురిని అరెస్ చేశామన్నారు. ఇప్పటివరకు నాలుగు మండలాల్లో 120 మందిపై బైండోవర్ కేసు నమోదు చేశామన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 9 ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని, 40.5 టన్నుల ఇసుకను సీజ్ చేశామన్నారు.

విద్యార్థులకు సత్కారం



సత్కారం పొందిన విద్యార్థులతో సంస్థ సభ్యులు

రాజాం సిటీ: స్థానిక మానవతా సంస్థ కార్యాలయంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన రాజాం, సంతకవిటి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. సన్మానం పొందిన వారిలో రాజాం మండలానికి చెందిన సీహెచ్ నవ్యశ్రీ(585 మార్కులు), జె.సురేష్(584 మార్కులు), ఎ.శంకరరావు(578 మార్కులు), సంతకవిటి మండలానికి చెందిన కె.నందిని(584 మార్కులు), ఎస్.శ్రావణి(581 మార్కులు), డి.దామోదరరావు (580 మార్కులు) ఉన్నారు. ఇదే స్ఫూర్తితో ఉన్నత చదువుల్లోనూ రాణించి, మంచి స్థాయిలో స్థిరపడాలని సంస్థ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, అచ్యుత్‌కుమార్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు బి.శంకరరావు, గిరి పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి

రేగిడి: ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర ఆధ్యాత్మిక సమన్వయకర్త పడాల ప్రసాదరావు అన్నారు. మండల కేంద్రంలోని విశ్వసాయి మందిరంలో భగవాన్ శ్రీసత్యసాయిబాబా ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన.. భక్తులకు సేవా కార్యక్రమాలు, వాటి ఫలితాలు, నామసంకీర్తన, నగర సంకీర్తన వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ప్రశాంతి సేవా ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు, భజన మండలి కన్వీనర్ లావేటి విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు కోటిపల్లిలో మెగా వైద్యశిబిరం

బాడంగి: మండలంలోని కోటిపల్లి గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం సోమవారం నిర్వహిస్తున్నట్లు క్యాంప్ ఇన్‌చార్జ్ సీహెచ్ వెంకటరమణ ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నేత్ర వైద్య తనిఖీలకు వచ్చే వారు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు.

జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



బొబ్బిలి: ఎన్నికల ప్రచారంలో ఇంటింటికీ వెళ్లి, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే శంబంగి



వంగర: నీలయ్యవలసలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ నుదుటన తిలకం దిద్ది, విజయోస్తు అని ఆశీర్వదిస్తున్న మహిళ

- ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్ర ప్రజలంతా సీఎం జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మరోసారి అధికారంలోకి తీసుకురావాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక పట్టణంలోని 29వ వార్డులో ఆదివారం పర్యటించిన వారికి అక్కడి ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. రాష్ట్రం, రాష్ట్రంలోని ప్రజలు అన్నివిధాలా బాగుండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తపన అని, ఆ దిశగా ఆయన తన ఐదేళ్ల పాలనలో సుపరిపాలన అందించారన్నారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని ఆయన సచివాలయ వ్యవస్థతో తీసుకువచ్చారన్నారు. ప్రస్తుతం ప్రతీ గ్రామంలోని సచివాలయం ద్వారా ప్రజలకు ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. అలాగే జగనన్న తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలు వచ్చి, చేరుతున్నాయన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం రావాలన్నా, ధ్రువపత్రం కావాలన్నా అప్పటి జన్మభూమి కమిటీలు, రాజకీయ నాయకులు, అధికారుల కాళ్లచుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. అప్పటి టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. ఎన్నికల వేళ మాయమాటలు చెప్పే టీడీపీ కూటమి నేతలను నమ్మవద్దన్నారు. వారిని నమ్మి ఓటేస్తే నష్టపోయేది మనమే నష్టపోతామన్న విషయం ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ప్రజలు కన్న ప్రతీ కలను జగనన్న సాకారం చేస్తున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం ఒక్క వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని, రానున్న ఎన్నికల్లోనూ అందరూ మళ్లీ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. అలాగే ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్న తమను కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మే 1వ తేదీన బొబ్బిలిలోని శ్రీకళాభారతి రోడ్డులో జరిగే సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు(విసు), కౌన్సిలర్ రేజేటి కృష్ణవేణి, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, జేసీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ శంబంగి శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంబంగి వేణుగోపాలనాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం..

వంగర: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని పార్టీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని నీలయ్యవలస, బాగెంపేట, అరసాడ గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయనకు ప్రజల నుంచి ఘనస్వాగతం లభించింది. డప్పు వాయిద్యాలు, కళాకారుల నృత్య ప్రదర్శనలతో ఆయనను సాదరంగా ఆహ్వానించి, తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఈ ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికల వేళ అబద్ధపు హామీలతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు అండ్ కో సిద్ధమయ్యారని, ఊరూరా తిరిగి లేనిపోని, అమలు చేయడానికి సాధ్యం కాని హామీలను కూడా ఇస్తామని ప్రచారం చేస్తున్నారన్నారు. వారి మాటలు నమ్మితే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. సీఎం జగనన్న చెప్పిందే చేస్తాడని, చేయగలిగిందే చెప్తాడన్న విషయం మర్చిపోవద్దన్నారు. మనం మరింత బాగుండాలంటే రానున్న ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించి, జగనన్నకు కానుకగా ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, పీఏసీఎస్ అధ్యక్షురాలు మరిచర్ల విజయలక్ష్మి గంగారావు, సర్పంచ్‌లు చింతగుంట రామారావు, రెడ్డి సత్యవతి, అర్జునరావు, శనపతి సత్యారావు, బెజ్జిపురం విజయకుమార్, బొంతు వెంకటరావు, వేమిరెడ్డి సూర్యనారాయణ, తెంటు జోగినాయుడు, యజ్జల రాము తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో నమ్మకానికి ప్రతిరూపం



బొబ్బిలి: మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి

- మీడియాతో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



రాజాం: మాట్లాడుతున్న రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

బొబ్బిలి: వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో అంటే నమ్మకానికి ప్రతిరూపమని, ఇదే విషయం ఈ ఐదేళ్ల పాలనలో నిరూపితమైందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక పట్టణంలో జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు స్వగృహంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశానికి హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టో రూపొందించారన్నారు. మేనిఫెస్టోను ఆయన ఓ భగవద్గీతగా, ఖురాన్‌గా, బైబిల్ భావించి, అందులోని ప్రతీ హామీని తప్పకుండా అమలు చేస్తారన్నారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల్లో 99 శాతానికి పైగా హామీలను ఆయన నెరవేర్చి, ప్రజల సంపూర్ణ విశ్వాసం పొందారన్నారు. కేవలం రెండు పేజీల మేనిఫెస్టోలోనే అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చే పథకాలు ఉన్నాయన్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ 600 హామీలు ప్రకటించి, వాటిలో కనీసం 10 శాతం కూడా నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. ఎన్నికల వేళ ఇప్పుడు అమలు సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు సిద్ధమయ్యారని, ఆయనను అస్సలు నమ్మవద్దన్నారు. ఓటమి భయంతోనే ప్రతిపక్షాలన్నీ ఏకమయ్యాయని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయమన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు సీహెచ్ రమేష్‌నాయుడు, జేసీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ఎస్.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోపై మండల కేంద్రంలోని విలేకరులతో పార్టీ జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంబంగి వేణుగోపాలనాయుడు మాట్లాడుతూ సీఎం జగనన్న విడుదల చేసిన మేనిఫెస్టోతో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. టీడీపీ హామీలను ప్రజలు నమ్మరన్నారు.

ప్రజామోద మేనిఫెస్టో..

రాజాం: రాష్ట్ర ప్రజలు ఆమోదించదగ్గ మేనిఫెస్టోను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారని పార్టీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ ప్రశంసించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇప్పటి పథకాలు కొనసాగించడంతో పాటు ఆ పథకాల్లో మరికొంతమందికి అవకాశమిచ్చారన్నారు. విద్య, ఆరోగ్యశ్రీ పథకాలకు ప్రభుత్వ చిరుద్యోగులకు కూడా అవకాశం కల్పించడం జరిగిందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబును నమ్మవద్దన్నారు. సమావేశంలో ఎంపీపీ యు.సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల అధ్యక్షుడు కె.సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీవి బూటకపు హామీలు

- నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మామిడి వాసునాయుడు



రామభద్రపురం: మాట్లాడుతున్న పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు వాసునాయుడు

రామభద్రపురం: ఎన్నికల వేళ సూపర్ సిక్స్ పేరిట టీడీపీ అమలు చేస్తామని చెబుతున్న హామీలు బూటకపు హామీలని, వాటిలో ఏవీ వారు అమలుచేయలేరని, ప్రజలు కూడా వారిని నమ్మడం లేదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు మామిడి వాసునాయుడు విమర్శించారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన టీడీపీ కూటమి అమలుచేయడానికి సాధ్యం కాని హామీలు ప్రకటించి, ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని, వారిని నమ్మితే నట్టేట మునగడం ఖాయమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలో ప్రజలకు చేసిన మంచిని అందరూ గుర్తించారన్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ 600 హామీలు ఇచ్చి, వాటిలో 10 శాతం కూడా నెరవేర్చలేదన్నారు. 2019 ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99 శాతానికి పైగా నెరవేర్చడంతో ఆయన నాయకత్వం పట్ల ప్రజల్లో మరింత విశ్వసనీయత పెరిగిందన్నారు. ఇదే నమ్మకం జగనన్నను మళ్లీ గెలిపిస్తుందన్నారు. ఎమ్మెల్యేగా శంబంగి వెంకట చినఅప్పలనాయుడును, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిచేందుకు అందరం కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, మండల జేసీఎస్ కన్వీనర్ సీహెచ్ సింహాచలంనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

తెర్లాం: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలంతా తమవంతు సహకారం అందించాలని ఎస్‌ఐ ఆర్.రమేష్ కోరారు. మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం, కూనాయవలస గ్రామాల్లో ఎన్నికల నిబంధనలపై ఆదివారం అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎటువంటి అల్లర్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ప్రజలంతా ఉండాలన్నారు. గ్రామాల్లో అల్లర్లు, గొడవలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతిభద్రత పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మనిషి ప్రవర్తనను మార్చే గ్రంథం ‘నీతిచంద్రిక’



ప్రసంగిస్తున్న సాహితీవేత్త రమణమూర్తి

రాజాం సిటీ: నీతిచంద్రిక గ్రంథం.. మనిషి ప్రవర్తనలో గొప్ప మార్పు తెచ్చే గ్రంథమని ప్రముఖ సాహితీవేత్త ఒమ్మి రమణమూర్తి అన్నారు. స్థానిక విద్యానికేతన్ స్కూల్‌లో రాజాం రచయితల వేదిక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ‘నీతిచంద్రిక–చిన్నయ గద్యశైలి’ అనే అంశంపై కాసేపు ప్రసంగించారు. చిన్నయసూరి బాలవ్యాకరణం అనే లక్షణ గ్రంథం రాయడంతో పాటు అందులో భాషను సోదాహరణంగా చూపే నీతిచంద్రికను కూడా రాశారన్నారు. సంస్కృత భాషలోని పంచతంత్రానికి అనువాదమే ఈ నీతిచంద్రిక అని తెలిపారు. గ్రాంథిక భాషావాది అయిన చిన్నయసూరి వచన కవిత్వ పదాల ప్రయోగంలో మద్దెల ధ్వని వినిపిస్తుందన్నారు. గద్యంలో రకరకాల అలంకారాలను ఇమిడ్చి కావ్య నిర్మాణం చేయగల ఘనుడని కొనియాడారు. కార్యక్రమంలో పి.తిరుపతిరావు, ఎస్.సత్యనారాయణ, టి.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల జోరు.. ప్రచారం హోరు..

వైఎస్సార్ సీపీ నేతలు ఎన్నికల ప్రచారంలో జోరు పెంచారు. ఆదివారం జరిగిన ప్రచారంలో ఇంటింటికీ వెళ్లిన ప్రజాప్రతినిధులు ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. గ్రామగ్రామాన ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నేతలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండడం విశేషం.

–సాక్షి నెట్‌వర్క్.



బొబ్బిలి: వెలగవలసలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంబంగికి ఘనస్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



వంగర: అరసాడలో ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్, చిత్రంలో ఎమ్మెల్సీ విక్రాంత్, అవనాపు విక్రమ్



రాజాం సిటీ: లక్ష్మీపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు



రాజాం: కొరాదిపురంలో ఇంటింటికీ వెళ్లి, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరావు తదితరులు



రేగిడి: లింగాలవలసలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తల ప్రచారం



రామభద్రపురం శ్రీరామ్‌నగర్ కాలనీలో ఎన్నికల ప్రచారంలో ఎంపీపీ లక్ష్మణరావు తదితరులు



రామభద్రపురం: కొండకెంగువలో జెడ్పీటీసీ సరస్వతి ఎన్నికల ప్రచారం



తెర్లాం: కూనాయవలసలో ఎన్నికల ప్రచారంలో మండల వైఎస్సార్ సీపీ నాయకులు



బాడంగి: హరిజనపాల్తేరులో వైఎస్సార్ సీపీని గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్న జిల్లా జేసీఎస్ కన్వీనర్ శ్రీకాంత్



బొబ్బిలి పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా నేతలు

చెప్పారంటే... చేస్తారంతే

అన్నివర్గాల మేలు కోరే మేనిఫెస్టో

రాష్ట్రంలోని అన్నివర్గాల మేలు కోరుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ తన ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించింది. రైతులు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులకు మేలు జరిగేలా పథకాలు రూపొందించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చడంతో ఈసారి కూడా ఆయన ప్రకటించిన హామీల అమలుపై ప్రజల్లో పూర్తి విశ్వాసం నెలకొంది. జగనన్న చెప్పాడంటే.. చేస్తాడంతే.. ఆయన చేయగలిగిందే చెప్తాడు..చెప్పిందే తప్పకుండా చేస్తాడన్న మాట ప్రతిఒక్కరి నోట వినిపిస్తుండడం విశేషం.

–రాజాం.

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టిసారించారు. ఈ రెండు బాగుంటేనే ప్రాంతాలన్నీ అభివృద్ధి పథంలో ఉంటాయన్న ఉద్దేశ్యంతో మేనిఫెస్టో విడుదల చేశారు. నవరత్నాల ప్లస్ మేనిఫెస్టోలో ప్రభుత్వ చిరుద్యోగులకు కూడా వైద్యం, సంక్షేమ పథకాల్లో స్థానం కల్పించడం చాలా ఆనందంగా ఉంది.

–గుంటముక్కల సప్తగిరి, రాజాం.

కౌలురైతుకు భరోసా..



రైతులకు కొండంత భరోసానిస్తూ వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఏటా ఇచ్చే పెట్టుబడి సాయాన్ని ఈసారి రూ.13,500 నుంచి రూ.16 వేలకు పెంచడం చాలా సంతోషంగా ఉంది. ప్రజలకు చేయగలిగిన హామీలనే జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తారు. గతంలో లాగే ఇప్పుడు కూడా ఇచ్చిన మాట ప్రకారం అమలు చేస్తారు. కౌలురైతులకు కూడా ఈ పథకం వర్తిస్తుందని చెప్పడం ఒకవిధమైన భరోసానే..

–తాడ్డి గోపాలకృష్ణ, రైతు, లక్ష్మీపురం, రాజాం మండలం.

జగన్‌మోహన్‌రెడ్డి మాటే శాసనం..



సీఎం జగన్‌మోహన్ రెడ్డి కల్లబొల్లి మాటలు చెప్పరు. ఏదైనా చెప్పారంటే చేస్తారంతే. నవరత్నాలు ప్లస్ మేనిఫెస్టోలో వృద్ధాప్య పింఛన్ రూ.3,500లు చేస్తామని హామీ ఇచ్చారు. అలా అన్నారంటే ఖచ్చితంగా చేస్తారు. రూ.4 వేలు చేస్తామని చంద్రబాబు అంటున్నారంటే అది ఉత్తుత్తి హామీయే. ప్రజలను మోసగించడానికే లేనిపోని హామీలు ప్రకటిస్తున్న చంద్రబాబును నమ్మం.

–గార విష్ణుమూర్తినాయుడు, శ్రీహరిపురం, వంగర మండలం.

వచ్చే ఐదేళ్లలో మరింత అభివృద్ధి..



నవరత్నాల ప్లస్ మేనిఫెస్టోలో అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమం కనిపిస్తోంది. గతంలో ఏ ప్రభుత్వమూ ఎస్సీ, ఎస్టీలను పట్టించుకోలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే ఎస్సీ, ఎస్టీలతో పాటు వెనకబడిన వర్గాలందరినీ ఆదుకున్నారు. వేలాది మత్స్యకార కుటుంబాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చాలా లబ్ధి పొందాయి. వచ్చే ఐదేళ్లలో కూడా జగనన్న హామీలతో మరింత అభివృద్ధి చెందుతాయనడంతో సందేహమే లేదు. చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మడం లేదు.

–గుడివాడ లక్ష్మీనారాయణ, గిరిజనుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, శ్రీహరిపురం, వంగర మండలం.

మహిళల ప్రగతి కోరే పథకం..



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఎన్నో పథకాలు పెట్టి, అమలు చేశారు. అందులో వైఎస్సార్ చేయూత చాలా మంచి పథకం. ఈ పథకాన్ని నవరత్నాల ప్లస్ మేనిఫెస్టోలో మళ్లీ ఉంచి, మహిళల ప్రగతి కోరుకోవడం శుభపరిణామం. ఇటువంటి హామీలేవీ టీడీపీ మేనిఫెస్టోలో లేవు. అందులో అన్నీ అమలుకానివే ఉన్నాయి.

–అలజంగి వెంకటమ్మ, కొండగూడేం, సంతకవిటి మండలం.

67 మద్యంసీసాలు స్వాధీనం

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురం గ్రామ జంక్షన్ వద్ద రాజాం మండలంలోని గురవాం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న 67 మద్యంసీసాలను పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి, వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ షేక్‌శంకర్ తెలిపారు.

పరామర్శ

తెర్లాం: మండలంలోని రాజయ్యపేట వీఆర్వో కామరాజు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.అప్పలనాయుడు ఆదివారం ఆ గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం సంఘం తరఫున రూ.10 వేలను ఆర్థికసాయంగా అందజేశారు.